

ముగిసిన ఆరాధనోత్సవాలు
కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆరిపోయిన ఆశల దీపాలు!
ఈత సరదా ముగ్గురు ప్రాణాలను బలిగొంది. కర్నూలు జిల్లాలో గురువారం వేర్వేరు చోట్ల ముగ్గురు బాలురులు ఈత కొడుతూ నీట మునిగి మృత్యువాత పడ్డారు. 10లో▸



ప్రయాణం నరకయాతన
హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిపై కర్నూలు నగర సమీపంలోని రింగ్ రోడ్డు పక్కనే పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. 10లో▸

న్యూస్‌రీల్

జిల్లా కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): రెడ్ క్రాస్ సొసైటీల ద్వారా అత్యుత్తమ సేవలందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి రెడ్ క్రాస్ అవార్డు దక్కింది. ఈ క్రమంలో గురువారం విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ అవార్డుతో పాటు గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల అధునాతన వసతులతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యంత తక్కువ ధరలకు లభ్యమయ్యేలా జనరిక్ మెడికల్ షాప్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రక్తదానానికి యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా అవగాహన కల్పిస్తామన్నారు. మత్స్యకారులు, చెంచులకు రెడ్ క్రాస్ సంస్థ ద్వారా మరిన్ని వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సురేఖ



గోస్పాడు: నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సురేఖ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడి మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీదేవి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఆమె స్థానంలో కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ సురేఖను ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్లను గుర్తించి నేరాల కట్టడికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక రామకృష్ణా పీజీ కళాశాల ఆడిటోరియమ్‌లో ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో ఆధారాలు, సాక్ష్యాలు కీలకమన్నారు. కేసు దర్యాప్తు తప్పుదోవ పట్టకుండా ఆధునిక సాంకేతిక ద్వారా నేరస్తులను గుర్తించే అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, ఫోరెన్సిక్ వైద్య నిపుణులు అసిమ్‌బాషా, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తం మరిగిన మనుషులు.. కన్నీళ్లతో కటకటాలు!

జంట హత్యల కేసులో తుది తీర్పు

- నంచలనం రేపిన చెరుకులపాడు నారాయణరెడ్డి, సాంబశివుడు హత్యోదంతాలు
- ఎనిమిదేళ్ల తర్వాత నిందితులకు యావజ్జీవ శిక్ష
- 11 మందికి శిక్ష ఖరారు, ఐదుగురు విడుదల
- కుటుంబ సభ్యుల్లో కట్టలు తెంచుకున్న కన్నీళ్లు

ఎవరికోసమైతే ఇద్దరిని చంపారో వాళ్లు కాపాడుతారనుకున్నారు. అడిగినంత డబ్బు ఇచ్చాం కాదా, ఎంచక్కా బయటకు రావచ్చనుకున్నారు. ఎనిమిదేళ్లు ఇలా గడిచిపోయింది.. ఇక కోర్టు మెట్లు ఎక్కే పని లేదనుకున్నారు.. గురువారం ఉదయం జిల్లా కోర్టు వద్ద ఉద్విగ్న వాతావరణం నెలకొంది. జంట హత్యల కేసులో నిందితులుగా ఉన్న వారంతా కోర్టుకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. ఎలాంటి తీర్పు వస్తుందోనే ఉత్కంఠ ప్రతి ఒక్కరిలో కనిపించింది. 11 గంటల సమయంలో 11 మంది నిందితులకు యావజ్జీవ శిక్ష విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పు వెలువరించింది. విషయం క్షణాల్లో బయటకు రావడంతో కన్నీళ్లు కట్టలు తెంచుకున్నాయి. నెత్తీనోరు కొట్టుకుంటూ, ఇక మాకు దిక్కెవరంటూ రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టించింది. ఇదిలా ఉంటే కోర్టు నుంచి బయటకు వచ్చిన ముద్దాయిలు కూడా తమ వాళ్లను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. చంపినప్పుడు ఆ కుటుంబాల్లో ఎంతటి క్షోభకు గురై ఉంటాయో, ఇప్పుడు వారి కుటుంబ సభ్యులను చూసి వాళ్లు కూడా అంతకు రెట్టింపు వేదనను అనుభవించడం కనిపించింది.

– కర్నూలు(సెంట్రల్)/వెల్దుర్తి

చెరుకులపాడు నారాయణరెడ్డి, ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు హత్య కేసుకు సంబంధించి ఈనెల 8న తుది తీర్పు వెలువరించనున్నట్లు కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు ముందుగానే ప్రకటించింది. దీంతో గురువారం ఉదయం 9 గంటల వరకు ప్రశాంతంగా ఉన్న కోర్టు ప్రాంగణం ఆ తర్వాత నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల రాకతో కిక్కిరిసింది. పోలీసులు వారిని కోర్టు బయటే నిలువరించారు. ఈ కేసులో ఏకంగా 11 మందిని జీవితఖైదు చేసి ఐదుగురిని నిర్దోషులుగా విడుదల చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.కబర్ధి తీర్పు వెల్లడించారు. తమ వారిని కడసారి చూపించాలని పోలీసులను శిక్ష పడిన ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. చివరకు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ముద్దాయిలను ప్రత్యేక వాహనంలో కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

ఇసుక దందా అడ్డుకోవడం.. ఎదుగుదల ఓర్వలేకపోవడం

2014 సార్వత్రిక ఎన్నికల తరువాత పత్తికొండ నియోజకవర్గంలో చెరుకులపాడు నారాయణరెడ్డి వైఎస్ఆర్‌సీపీలో చేరి తిరుగులేని నాయకుడిగా ఎదగడం మొదలు పెట్టారు. నిత్యం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ వారి కష్టనష్టాల్లో పాల్పంచుకుంటూ ప్రజాభిమానం చూరగొన్నారు. దీంతో పత్తికొండ నియోజకవర్గంలో తమ అధికారానికి అడ్డొస్తాడని ప్రత్యర్థులు హత్యకు పూనుకున్నారు. అదేవిధంగా 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే కేఈ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, వెల్దుర్తి మండల నాయకులు, పోలీసుల సహాయంతో చెరుకులపాడులో పెద్ద ఎత్తున ఇసుక దందా సాగింది. ఈ విషయంలో నారాయణరెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు. వీలైనంత వరకు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దీంతో అధికార పార్టీ అండదండలతో ఇసుకాసురులు ఆయనను అడ్డు తొలగించుకునేందుకు నిర్ణయించుకున్నారు.

మే 21, 2017
మాటు వేసి మట్టుబెట్టారు!



చెరుకులపాడు నారాయణరెడ్డి, సాంబశివుడు (ఫైల్)





ఘటనాస్థలంలో హత్యకు గురైన చెరుకులపాడు నారాయణరెడ్డి వాహనం (ఫైల్)

కర్నూలులోని తన స్వగృహం నుంచి బయలుదేరిన నారాయణరెడ్డి నంద్యాలలో, వెల్దుర్తిలో పెళ్లిళ్లకు హాజరయ్యారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని తన స్వగ్రామం చెరుకులపాడు మజరా కొసనాపల్లెలో ఆంజనేయస్వామికి పూజాది కార్యక్రమాలు ముగించుకుని తిరిగి కృష్ణగిరి మండలం రామకృష్ణాపురంలో ఓ పెళ్లికి రెండు వాహనాలలో బయలుదేరారు. అప్పట్లో వెల్దుర్తి నుంచి కృష్ణగిరి మధ్య రహదారి వెడల్పు, మధ్యలో కల్వర్టు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కల్వర్టు మరమ్మతులు జరిగే ప్రాంతంలోనే తమ సొంత పొలాలు ఉన్న నిందితులు మాటు వేసి ట్రాక్టర్‌తో నారాయణరెడ్డి ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. ఆ వెంటనే అతి కిరాతకంగా ఆయనను అంతమొందించారు. అడ్డు వచ్చిన అనుచరుడు సాంబశివుడుని సైతం ఘోరంగా చంపి పరారయ్యారు. మరొక వాహనంలో ఉన్న చెరుకులపాడుకు చెందిన గొల్ల మోహన్ ఫిర్యాదు మేరకు అప్పటి కృష్ణగిరి ఎస్ఐ సోమ్లా నాయక్ జంట హత్యల కేసులో 17 మందిపై కేసు నమోదు చేశారు. కొంతకాలం తర్వాత ఇదే కేసులో ఏ14, ఏ15గా ప్రస్తుత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మలను చేర్చారు. అయితే కేఈ శ్యాంబాబు పేరును హైకోర్టు ఆదేశాలతో.. ఏ15 కప్పట్రాల బొజ్జమ్మ పేరును జిల్లా కోర్టు జోక్యంతో తొలగించారు. ఇకపోతే కేసు విచారణలో ఉండగానే ఏ4 కోతుల రామాంజనేయులు(40) మరణించాడు.



భర్త మరణాన్ని జీర్ణించుకోలేక మృతదేహం వద్ద విలపిస్తున్న కంగాటి శ్రీదేవి (ఫైల్)

చంపడాలు, చావడాలు ఎవరికీ మంచివి కావు



సాంబశివుడి కుటుంబ సభ్యులు

చెరుకులపాడు నారాయణరెడ్డిని హతమార్చే సమయంలో అడ్డుపడిన బోయ సాంబశివుడును సైతం దారుణంగా మట్టుబెట్టారు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు సంతానం. నారాయణరెడ్డి కుటుంబీకుల ఆశీస్సులతో సాంబశివుడి తల్లి బోయ రాములమ్మ ప్రస్తుతం చెరుకులపాడు గ్రామ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. ఆయన తండ్రి జయరాముడు కాలం చేయడంతో.. తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు గంగాధర్, మురళీకృష్ణ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో 'సాక్షి' వాళ్లను పలుకరించగా.. 'సాంబశివుడిని అన్యాయంగా పొట్టనపెట్టుకున్నారు. మేము అష్టకష్టాలతో నారాయణరెడ్డి కుటుంబం చలువతో జీవనం నెట్టుకొస్తున్నాం. చంపడాలు, చావడాలు, జైలుకు పోవడాలు ఎవరికీ మంచివి కావు. మా కుటుంబం పడిన వేదన భవిష్యత్‌లో మరొకరికి రాకూడదు.'' అని కన్నీళ్లు పెట్టుకున్నారు.

అప్పుడు వాళ్లను ఏడ్పించి.. ఇప్పుడు వీళ్లు ఏడుస్తూ!

(యావజ్జీవ శిక్ష పడటంతో రోదిస్తున్న ముద్దాయిలు)



రెండు ప్రాణాలను బలిగొన్నారు.
అత్యంత కిరాతకంగా నరికి చంపారు.
మరణాయుధాలు వికటాట్టహాసం చేశాయి.
ప్రగతికి పరుచుకోవాల్సిన రాళ్లు ఎగిరిపడ్డాయి.
కల్లాపి చల్లినట్లుగా రక్తం చిందింది.
ఏదో సాధించినట్లుగా ప్రత్యర్థులు,
విజయానందంతో పరుగుతీశారు.
రెండు కుటుంబాల్లో చీకట్లు నింపారు.
నమ్మిన నేతలు కాచుకుంటారనుకున్నారు..
కేసుల్లో ఇరుక్కుని కోర్టు చుట్టూ తిరిగారు..
రూ.2కోట్లకు పైగా చెల్లించుకున్నారు..
పెద్దలు దర్జాగా బయటతిరుగుతున్నారు..
పేదలు కుటుంబాలకు దూరమయ్యారు..
కన్నీళ్లు పెట్టుకున్నా పాపం వెంటాడింది..
జీవితాలను జైలుపాలు చేసింది.
నమ్ముకున్న వాళ్లకు కన్నీరే మిగిలింది.











కిక్కిరిసిన కోర్టు ప్రాంతం





యావజ్జీవ శిక్ష తీర్పు వెలువడటంతో గుండెలు బాదుకుంటున్న ముద్దాయిల కుటుంబ సభ్యులు

పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషం

- సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలపై మండిపడిన జర్నలిస్ట్ సంఘాలు
- జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం అమానుషమని జర్నలిస్ట్ సంఘాల నేతలు, జర్నలిస్టులు విమర్శించారు. గురువారం సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి నివాసంలో అనుమతి లేకుండా పోలీసులు గంటకుపైగా సోదాలు చేయడంపై జర్నలిస్టులు మండిపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మధు, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ పి. హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై దాడి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడమేనని విమర్శించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న పత్రికల జోలికెళితే ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలను జీర్ణించుకోలేని పాలకులు విలేకరులు, పత్రికా ఎడిటర్లను టార్గెట్‌గా చేసుకొని దాడులు చేయడం ప్రజా స్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని విమర్శించారు. ప్రశ్నించే గొంతును నొక్కాలనుకోవడం దుర్మార్గమన్నారు. అక్రమ కేసులు పెట్టి, దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడితే భయపడే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు బాలమద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు నాగేంద్ర, రాజశేఖర్, చల్లా మధు, ఉస్మాన్, బాలనాయక్, ఎస్‌డీపీఐ నాయకులు ఎజాజ్, సన్నల సాయి రాంరెడ్డి, శివరామిరెడ్డి, సీపీఎం నాయకులు లక్ష్మణ్, పుల్లా నరసింహ, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, సోమన్న, దళిత సమాఖ్య నాయకులు ప్రేమ్‌కుమార్, రాంబాబు, జాకోబ్, రాము, మోహన్, దస్తగిరి, చంద్రవరప్రసాద్, ద్వారకానాథ్, గిరిబాబు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని గాంధీచౌక్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదు



దేశంలో ఎక్కడ కూడా రాష్ట్రంలో ఉన్న అధ్వాన పరిస్థితులు లేవు. పత్రికలపై దాడులు చేయడం విలేకరులను బెదిరించడం ఏంటి? తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ దినపత్రిక ఎడిటర్ ఇంట్లోకే ఎలాంటి అనుమతులు లేకుండా పోలీసులు వెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజల గొంతు నొక్కేయాలనుకోవడం సిగ్గుచేటు. ఇటీవల కాలంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతోంది.

– శంకర్, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ కార్యదర్శి, నంద్యాల

పత్రికా స్వేచ్ఛపై దాడి సిగ్గుచేటు



సాక్షి పత్రిక సంపాదకులను ప్రభుత్వం టార్గెట్ చేయడం శోచనీయం. పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులు సిగ్గుచేటు. అసలు రాష్ట్రంలో పత్రికలు, మీడియాకు స్వేచ్ఛ ఉందో లేదో అర్థం కావడం లేదు. ఉన్నది ఉన్నట్లు రాస్తే ప్రభుత్వ పెద్దలు జీర్ణించుకోలేక పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులను ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలోనే చూడాల్సి వస్తోంది.

– అకుమల్ల రహీమ్, ఆల్‌మదర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, నంద్యాల

కమనీయం.. కల్యాణం



పెళ్లి మండపానికి స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



పెళ్లి పీటలపై కొలువైన ఉత్సవ మూర్తులు భూనీలా సమేత శ్రీ జ్వాలా నరసింహుడు

ఆళ్లగడ్డ: జయజయ నారసింహ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. దేదీప్యమానమైన విద్యుద్దీప కాంతుల వెలుగులో.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాల నడుమ శ్రీ లక్ష్మీనరసింహుడు భూనీల మహాలక్ష్మిల పరిణయ వేడుక వైభవంగా సాగింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఎగువ అహోబిల క్షేత్రంలో లక్ష్మీనరసింహ జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మూలమూర్తులను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులు భూనీలా సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వాములను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించి అనంతరం పట్టు పీతాంబారాలతో అలంకరించి కొలువుంచారు. శ్రీ సుదర్శన హోమం నిర్వహించారు. ఆ తర్వాత పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం ముద్రకర్త కిడాంబి వేణుగోపాలన్, మఠం మేనేజర్ మాధవన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

అభివృద్ధి పనులు ఇంకెప్పుడు పూర్తి చేస్తారు

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఐడీటీఆర్ భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిని విస్మరిస్తుందని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఇంకెప్పుడు పూర్తి చేస్తారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కొత్తకోట గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన రూ. 18.50 కోట్లతో నిర్మిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రీసర్చ్ (ఐడీటీఆర్) భవనంతో పాటు దేవరబండ, వెంగళాంపల్లి చెరువులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సకాలంలో హంద్రీ నీవా కాలువ నుంచి నీరు అందించలేక పోయిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలకు తాగేందుకు మంచి నీరు, పశువులకు నీరు లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ప్రారంభించిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మాజీ మంత్రి వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షులు సోమేశ్ యాదవ్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రుద్రవరం: నర్సాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అహోబిలానికి చెందిన రంగ సుబ్బరాయుడు (70) గురువారం కారులో ఆళ్లగడ్డకు వెళ్లి అక్కడ పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో రవి డిగ్రీ కళాశాల సమీపంలో ఎదురుగా వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన యువకుడు మృతి


మృతుడు రాజశేఖర్ (ఫైల్)

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వేస్టేషన్‌లో గత నెల 27వ తేదీన ప్రమాదవశాత్తూ రైలు దిగుతూ కింద పడి గాయపడిన యువకుడు రాజశేఖర్ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. నారాయణపురం గ్రామానికి చెందిన ఈ యువకుడిని మొదట ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సల నిమిత్తం కర్నూలుకు తరలించారు. పది రోజుల నుంచి కర్నూలులో చికిత్సలు పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని రైతు దుర్మరణం


బంగారయ్య (ఫైల్)

ఆదోని సెంట్రల్: రైలు ఢీకొనడంతో పంటకు నీరు పెట్టడానికి వెళ్లిన రైతు అక్కడికక్కడే మృతి చెందారు. ఆదోని మండలం గణేకల్ గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు.. ఇస్వీ–కుప్పగల్ రైల్వేస్టేషన్ల మధ్య కి.మీ. 523/23–24 వద్ద తన అన్న చేనులో వేసిన కనకాంబరాల పంటకు నీరు పెట్టడానికి బంగారయ్య(35) బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వెళ్లాడు. రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్ర రక్తగాయాలపాలైన బంగారయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య తాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ప్రయాణం నరకయాతన


రింగ్ రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిన దృశ్యం

కర్నూలు నగర శివారులోని రింగ్ రోడ్డు వద్ద జాతీయ రహదారి 44 పక్కన గురువారం అకస్మాత్తుగా గుంత ఏర్పడింది. సూరత్ – చైన్నై రహదారి నిర్మాణంలో భాగంగా రింగ్ రోడ్డు కింద టన్నెల్ తవ్వుతుండంతో గుంత పడటంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. కారుల్లో, బస్సుల్లో చంటి బిడ్డలు ఏడుస్తుండటంతో కొందరు వారిని ఎత్తుకుని అటూ ఇటూ తిరిగారు. ఉల్లిందకొండ గ్రామ సమీపం నుంచి కర్నూలు నగరం వరకు జాతీయ రహదారి నిండా వాహనాలే కనిపించాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారులు కొంత చర్యలు తీసుకున్నా అర్ధరాత్రి వరకు వాహనచోదకులకు ఇబ్బందులు తప్పలేదు. గుంతను పూడ్చే పనులు పూర్తయితే తప్ప వాహనాలు సాఫీగా తిరిగే అవకాశాలు లేవు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


చంటి బిడ్డతో నడిచి వెళ్తున్న మహిళ


జాతీయ రహదారి పక్కనే ఏర్పడిన గుంత


గుంతను పూడ్చేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్న ఎన్‌హెచ్ అధికారులు


వాహనాలు నిలిచిపోవడంతో డివైడర్ దాటి వెళ్తున్న వాహనదారులు

ఆశల దీపాలు ఆరిపోయాయి!

- వేర్వేరు చోట్ల ఈతకెళ్లి ముగ్గురు బాలురు మృత్యువాత


సిద్ధపోగు రోహాణ్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మనస్పర్థలతో భర్తకు దూరంగా ఉన్న ఆమె తన కుమారుడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే పదేళ్ల బాలుడు కాలువలో పడి మృతి చెందాడు. ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామ పరిధిలోని తుంగభద్ర దిగువ కాలువలో ఈ దుర్ఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎమ్మిగనూరు ఎస్‌ఎంటీ కాలనీలో సిద్ధపోగు శిరోమణి నివాసముంటున్నారు. ఈమె కుమారుడు సిద్ధపోగు రోహాణ్(10) వీవర్స్ కాలనీ ప్రభుత్వ స్కూల్లో 4వ తరగతి చదువుతున్నాడు. పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ శిరోమణి డీఎస్సీకి సిద్ధం అవుతున్నారు. ఈమె భర్త చరితబాబు.. కామవరంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆదోనిలో నివాసముంటున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో కొన్ని సంవత్సరాలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఎక్కడికి వెళ్లవద్దు ఇంటి దగ్గరే ఉండు అని కుమారుడు రోహాణ్‌కు చెప్పి తల్లి డీఎస్సీకి చదివేందుకు సమీపంలోని స్టడీ హాల్‌కు వెళ్లారు. తల్లి మాటలు వినకుండా బాలుడు గుడేకల్ గ్రామ పరిధిలోని తుంగభద్ర దిగువ కాలువకు వెళ్లి నీటిలో దిగి ఈతరాక మునిగిపోయాడు. కాలువ దగ్గర కాపలాగా ఉన్న మున్సిపల్ సిబ్బంది కొద్ది సేపు తర్వాత చూడటంతో బాలుడి మృతదేహం కనిపించింది. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సమాచారం ఇవ్వడంతో పోలీసులను సంఘటన స్థలానికి పంపి బాలుడి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.


బాలుడి ప్రాణం తీసిన కాలువ

ఈతకు వెళ్లి బాలుడి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో బోయ శ్రీను(14) అనే బాలుడు ఈతకు బావికి వెళ్లి ముచ్చరావటంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ, అనసూయ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు బోయ శ్రీను(14) ఐదో తరగతి వరకు చదువుకొని బడి మానేసి కూలీ పనులకు వెళ్తున్నాడు. స్నేహితులతో కలసి బావి దగ్గరకు ఈతకు వెళ్లారు. బావిలో ఈత కొడుతుండగా ఫిట్స్ రావటంతో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయటంతో అక్కడ ఉన్నవారు బావిలో దూకి గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. కుమారుడు మృతి చెందటంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


బోయ శ్రీను (ఫైల్)

ప్రాణం తీసిన ఈత సరదా


అనూక్(ఫైల్)

నందవరం: సరదాగా తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి అనూక్(14) అనే బాలుడు మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. నందవరం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన శివ, రాణెమ్మ దంపతులు ఏకైక కుమారుడు అనూక్(14) నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసుకున్నాడు. గురువారం గ్రామంలోని కొందరు తోటి స్నేహితులతో కలిసి పెద్దకొత్తిలి గ్రామం ఒడ్డున తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లాడు. లోతైన మగుడులో ఈత కొడుతూ ప్రమాదానికి గురయ్యాడు. అనుకోకుండా మడుగు నీటిలోకి జారిపోయాడు. తోటి స్నేహితులు తేరుకునేలోపే అనూక్ తుదిశ్వాస విడిచాడు. స్నేహితులు పెద్దకొత్తిలి గ్రామంలోకి పరుగులు పెడుతూ పెద్దలకు విషయం చెప్పారు. పెద్దలు అక్కడికి చేరుకుని మడుగులో గాలించారు. నీటి అడుగున విగత జీవిగా పడి ఉన్న అనూక్‌ను మడుగు నుంచి బయటకు తెచ్చారు. అప్పటికే అనూక్ నీరు మింగి శ్వాస విడచడంతో అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. అనంతరం సంజీవపురానికి అనూక్ మృతదేహాన్ని తీసుకెళ్లగా బంధువుల రోదనలు మిన్నంటాయి. ఒక్కగానొక్క బిడ్డ మృత్యువాత పడటంతో తల్లిదండ్రులకు దుఃఖమే మిగిలి. విషయం తెలుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆర్‌బీకేల రేషనలైజేషన్‌కు ప్రతిపాదనలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకేల) రేషనలైజేషన్ ప్రక్రియ ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపింది. కర్నూలు జిల్లాలో 229 వీఏఏలు వీహెచ్‌ఏలు 115, నంద్యాల జిల్లాలో వీఏఏలు 245, వీహెచ్‌ఏలు 101 మంది పని చేస్తున్నారు. వీఏఏ/ వీహెచ్‌ఏలకు 2,200 ఎకరాల నుంచి 2,600 ఎకరాల వరకు ఉంటుంది. 3,000 ఎకరాలు ఆపైన భూములు ఉంటే వీఏఏతో పాటు ఎంపీహెచ్‌ఏ కూడా ఉంటారు. కర్నూలు జిల్లాతో పోలిస్తే నంద్యాల జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో 38 మంది వీఏఏలు, 11 మంది వీహెచ్‌ఏలు మొత్తంగా 49 మంది కర్నూలు జిల్లాకు రానున్నారు. ఆర్‌బీకేలకు స్వంత భవనం ఉండి సాగు తక్కువగా ఉన్న వాటికి ఎంపీఇవోను ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆమోదం తర్వాత రేషనలైజేషన్ ప్రక్రియ అమలులోకి వస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి నెలలో జరిగిన బీఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 3,389 మంది పరీక్షలు రాయగా 3,276 మంది, సప్లిమెంటరీకి 274 మంది పరీక్షలు రాయగా 239 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ నెలలో జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. మొత్తం 6, 320 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రిజిస్టర్ చేసుకోగా 6,115 మంది హాజరు కాగా 6,096 మంది ఉత్తీర్ణత సాధించారు.

పరీక్షలు

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం డిగ్రీ 2వ సెమిస్టర్ రెగ్యులర్, 6వసెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 2వ సెమిస్టర్‌కు 10, 215 మందికి 9,181 మంది పరీక్షలు రాసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 448 మందికి 388 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థులు చూసిరాతలకు పాల్పడగా వారిని డిబార్ చేసినట్లు తెలిపారు.

13న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల చెస్ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ విద్యాలయంలో ఈనెల 13వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. 11 ఏళ్ల బాలబాలికలు ప్రత్యేక విభాగాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాల కోసం 9010451585ను సంప్రదించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొమ్మలసత్రం: పట్టణంలోని బొమ్మలసత్రం రైల్వేగేటు సమీపంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

పిడుగుపాటుకు నాలుగు గేదెలు మృతి


మృతి చెందిన గేదేలు

కొలిమిగుండ్ల: మీర్జాపురంలో పిడుగుపాటుకు మొట్టె వెంకట కృష్ణుడుకు చెందిన నాలుగు పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. కుటుంబ పోషణ కోసం ఇంటి సమీపంలో గేదెల కోసం షెడ్డు ఏర్పాటు చేశాడు. అందులోని నాలుగు గేదెలు బుధవారం రాత్రి పిడుగు పాటు శబ్దానికి మృతి చెందాయని బాధిత రైతు తెలిపాడు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

- నాలుగు నెలల క్రితం వివాహం
- అత్తింటి వారే చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ


చిన్నారి (ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలో గురువారం ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరు మండలం గోరంట్ల గ్రామానికి చెందిన కురువ జయమ్మ, శ్రీనివాసుల దంపతుల మూడవ కుమార్తె చిన్నారి(18)కి కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వు గ్రామానికి చెందిన దుబ్బ నరసింహులు, అనుమక్క దంపతుల కుమారుడు ఎల్లప్పతో నాలుగు నెలల క్రితం వివాహమైంది. ఎల్లప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ డోన్ పట్టణంలోని కోట్ల స్టేడియం సమీపంలో తల్లిదండ్రులతో కలసి ఉంటున్నారు. అతని భార్య చిన్నారి ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ.. గురువారం మధ్యాహ్నం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిందని చిన్నారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబీకులు, బంధువులు పెద్ద ఎత్తున డోన్‌కు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా తమ బిడ్డను అత్తింటి వాళ్లే చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణ పోలీసులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించి విచారణ చేపట్టారు. ఈ విషయంపై పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాను వివరణ కోరగా.. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

ముగిసిన వజ్రోత్సవ వేడుకలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. చివరి రోజు హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి తీర్థ మహాస్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. అంతక ముందు వేద పండితులు అమ్మవారికి ప్రాతఃకాల పూజ, శ్రీచక్ర నవావరణార్చన, చతుషష్టికళార్చన, ప్రాణప్రతిష్ట, జపానుష్టానములు, దుర్గాసప్తశతీ పారాయణం, రుద్రపారాయణం, సుందరకాండ, భగవద్గీత, భారత సంపూర్ణ రామాయణం, రుద్రాభిషేకం, చండీ, రుద్ర, రాజశ్యామల హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరలో వాసవీమాత గ్రామోత్సవం కనులవిందుగా సాగింది.


పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి తీర్థ మహాస్వామి


ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి

యువకుడి దారుణ హత్య


రఫిక్ మృతదేహం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని భూపాల్ నగర్‌కు చెందిన రఫిక్ (30) గురువారం దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. భూపాల్ నగర్‌కు చెందిన రఫిక్ కొన్నేళ్లుగా బర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఇటీవల కాన్పు కోసం పుట్టినింటికి వెళ్లింది. రఫిక్ రోజు మాదిరిగానే బర్రెలను మేత కోసం పడిదెంపాడు గ్రామ పొలాలకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో గ్రామ పొలిమేరలో రక్తపు మడుగులో పడి ఉండటం చూసిన చుట్టుపక్క పొలాల రైతులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతుని తండ్రి నబిసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోద్ చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తాలూకా అర్బన్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలవనరుల శాఖ అతిథిగృహం ఆవరణలో గురువారం ఓ కారు మంటల్లో దగ్ధమైంది. సున్నిపెంటలోని వైజాగ్ క్యాంప్‌కు చెందిన కె.నాగమల్లికార్జున కారును స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆర్‌ఐ రాజేష్ కు అద్దెకు ఇచ్చాడు. సాయంత్రం ఆయన కారు ను స్టార్ట్ చేయగా అకస్మాత్తుగా పొగలు వచ్చి మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. ఫైర్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ శ్రీశైలం నుంచి రావడానికి ఆలస్యం కావడంతో ఇక్కడున్న సిబ్బంది బకెట్లతో నీళ్లను చల్లి కొంత అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని తెలుస్తోంది.

అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్

- జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీ నవ్య


మాట్లాడుతున్న జేసీ నవ్య


వర్క్‌షాప్‌లో హాజరైన ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, ఎంపీడీఓలు

కర్నూలు(అర్బన్): అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్‌ను రూపొందించాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీ నవ్య ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల విజన్ కార్యాచరణ ప్రణాళిక, నియోజకవర్గాల వారీగా విజన్ ప్రణాళికలపై స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా స్టేక్ హోల్డర్లతో జిల్లా నుంచి మండల స్థాయి వరకు సమావేశాలు నిర్వహించాలన్నారు. విజన్ ఆంధ్రలో ఉంటే పది సూత్రాలు.. జీరో పావర్టీ, అగ్రికల్చర్ సెక్టార్, వాటర్ సెక్యూరిటీ, స్కిల్ డెవలప్‌మెంట్, సోషల్ సెక్యూరిటీ ఆధారంగా విజన్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు. సామాజిక భద్రతా పెన్షన్ల విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు. ప్లానింగ్ డిపార్టుమెంట్ అడ్వైజర్ సీతాపతి మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో రూపొందించే ప్రణాళికకు చాలా ప్రాముఖ్యత ఉందని, ముఖ్యమంత్రి స్వయంగా చూస్తారన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్, సీపీఓ హిమ ప్రభాకర్‌రాజు, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్, నంద్యాల సీపీఓ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ జీ నాసర రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.